# రసాయనాలకు చెక్- సేంద్రీయమే శాశ్వత పరిష్కారం

## ఉనికిచెర్లలో ఎస్ ఆర్ యూనివర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థుల విస్తృత చైతన్య ర్యాలీ

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఫిబ్రవరి 20: ((జర్నలిస్ట్ వార్త):** రైతు భవిష్యత్తు భూమి ఆరోగ్యంతో ముడిపడి ఉందని, రసాయనాలపై ఆధారపడకుండా సేంద్రీయ పద్ధతుల వైపు మళ్లాల్సిన సమయం ఆసన్నమైందని స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఉనికిచెర్ల గ్రామంలో శుక్రవారం అనంతసాగర్ ఎస్ ఆర్ అగ్రికల్చర్ విద్యార్థులు విస్తృత అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ ప్రధాన వీధుల గుండా ప్లకార్డులు, నినాదాలతో సాగిన ఈ ర్యాలీ రైతుల దృష్టిని ఆకర్షించింది. "సేంద్రీయమే భూమికి జీవం రసాయనాల తగ్గింపు రైతు రక్షణ వంటి నినాదాలతో గ్రామంలో చైతన్యం కలిగించారు. అనంతరం రైతులతో సమావేశం ఏర్పాటు చేసి సేంద్రీయ సాగు విధానాలపై సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల భూమి నిర్మాణం దెబ్బతిని, సూక్ష్మజీవుల సమతుల్యత క్షీణిస్తోందని తెలిపారు. దీర్ఘకాలంలో భూమి సారశక్తి తగ్గిపోవడం వల్ల దిగుబడులు పడిపోతాయని, ఖర్చులు పెరిగి రైతు లాభాలు తగ్గిపోతాయని వివరించారు. అదే





సమయంలో సేంద్రీయ ఎరువులు, వర్మీ కంపోస్ట్, జీవామృతం, గోమూత్రం వంటి సహజ వనరులను వినియోగించడం ద్వారా భూమి సారవంతం పెరుగుతుందని చెప్పారు. పంటల మార్పిడి విధానం అనుసరించడం వల్ల నేలలో పోషకాలు సమతుల్యంగా ఉంటాయని, మిశ్రమ పంటల సాగు ద్వారా ప్రమాదాలు తగ్గుతాయని సూచించారు. నీమాయిల్, సహజ కషాయాలు వంటి జీవ ఆధారిత పురుగుమందుల వినియోగం వల్ల పంటలపై రసాయన అవశేషాలు తగ్గి నాణ్యమైన దిగుబడులు లభిస్తాయని తెలిపారు. ఆరోగ్యానికి హానికరమైన రసాయన అవశేషాలు లేకపోవడం వల్ల వినియోగదారుల్లో సేంద్రీయ ఉత్పత్తులపై డిమాండ్ పెరుగుతోందని పేర్కొన్నారు. సేంద్రీయ పంటలకు మార్కెట్లో మంచి ధరలు లభిస్తున్నాయని, సరైన ప్రణాళికతో సాగు చేస్తే రైతులు ఆర్థికంగా బలపడగలరని చెప్పారు. భూమిని కాపాడుకోవడం అంటే భవిష్యత్ తరాలను కాపాడుకోవడమేనని స్పష్టం చేశారు. గ్రామ రైతులు విద్యార్థుల సూచనలను ఆసక్తిగా విన్నారు. పలువురు రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకుని సేంద్రీయ సాగు వైపు అడుగులు వేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, ఫైనల్ ఇయర్ వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి టి. హరీశ్ రావు పరామర్శ

## మాజీ ఎమ్మెల్యేల హాజరు ధర్మసాగర్‌లో సంతాపం





**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో ఫిబ్రవరి 20 ( జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ వరంగల్ యూనిట్ బ్రాంచ్ మేనేజర్ పందిళ్ళ అశోక్ కుమార్ తల్లి పందిళ్ళ సుచేత అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. ఈ విషాద వార్త తెలిసిన వెంటనే శుక్రవారం మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే టి. హరీశ్ రావు ధర్మసాగర్ మండల కేంద్రానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుచేత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆయన, అశోక్ కుమార్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ దుఃఖ సమయంలో ధైర్యంగా ఉండాలని, పార్టీ తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, ఆరూరి రమేష్, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు. మాజీ కార్పొరేషన్ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, నాగుర్ల వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, మర్రి యాదవ రెడ్డి, గంట రవి కుమార్, గుండ్రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, మండల నాయకులు కర్ర సోమిరెడ్డి, ప్రతాప్ తదితరులు నివాళులర్పించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సుచేతకు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.

# ఖమ్మంలో నిరంతర అన్నసేవ..

## అన్న అభిమానుల ఆదరణతో క్యాంటీన్‌కు ఊతం -తాళ్లూరి శిఖర పుట్టినరోజు సందర్భంగా అన్నప్రసాద వితరణ




**ఖమ్మం/ఫిబ్రవరి 20 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం పట్టణంలో ఎన్టీ రామారావు అభిమానుల సహకారంతో విజయవంతంగా, నిరంతరంగా కొనసాగుతున్న "అన్న క్యాంటీన్" సేవా కార్యక్రమం మరోసారి మానవత్వాన్ని చాటింది. తెలుగు తమ్ముడు నల్లమల్ల రంజిత్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ క్యాంటీన్‌లో శుక్రవారం తాళ్లూరి శిఖర పుట్టినరోజు సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పేదలు, నిరుపేదలు, అవసరమైన వారికి ప్రేమతో భోజనం పంచిపెట్టడం ద్వారా వేడుకను అర్థవంతంగా జరుపుకోవడం విశేషం. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ, ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. తమ ఆనందాన్ని పంచుకుంటూ సేవా కార్యక్రమానికి సహకరించిన తాళ్లూరి శిఖర కుటుంబ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే పుట్టినరోజులు, పెళ్లిరోజులు లేదా కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థంగా "అన్న క్యాంటీన్"లో



అన్నప్రసాద వితరణ నిర్వహించాలని ఎన్టీఆర్ అభిమానులను ఆయన కోరారు. సేవా భావంతో ముందుకు వస్తే మరింత మందికి ఆకలిబాధ తీర్చే అవకాశం కలుగుతుందని తెలిపారు.

# ఆకేరు వాగుపై చెక్ డ్యామ్ పనులు వేగవంతం

## : రైతుల సాగునీటి కష్టాలు తీర్చడమే లక్ష్యం : ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**వర్ధన్నపేట/ ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట నియోజకవర్గ రైతుల చిరకాల వాంఛను నెరవేర్చే దిశగా ఆకేరు వాగుపై చేపట్టిన చెక్ డ్యామ్ నిర్మాణ పనులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శుక్రవారం పరిశీలించారు. సుమారు రూ. 65 లక్షల అంచనా వ్యయంతో జరుగుతున్న ఈ ప్రాజెక్టు పనుల పురోగతిని ఆయన క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చెక్ డ్యామ్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు అత్యంత కీలకమని, పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు కీలక అంశాలను వివరించారు. ఈ చెక్ డ్యామ్ నిర్మాణంతో వర్ధన్నపేట పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో భూగర్భ జలమట్టం గణనీయంగా పెరగనుంది.





వందలాది ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించడమే కాకుండా, వేసవిలో పశువులకు తాగునీటి ఎద్దడిని నివారించడమే ప్రభుత్వ లక్ష్యం మన్నారు. గత పదేళ్ల కాలంలో ఆకేరు వాగు అభివృద్ధిని ఎవరూ పట్టించుకోలేదని విమర్శించిన ఎమ్మెల్యే, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాగు పునరుద్ధరణకు ప్రాధాన్యతనిచ్చి రూ. 65 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేసిన ఎమ్మెల్యే నాగరాజు, నియోజకవర్గంలో ఆగిపోయిన లేదా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ దశలవారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీలో నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకారం ఘనంగా



**వైరా/ఫిబ్రవరి 21 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం జిల్లాలోని వైరా మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన పాలకవర్గం శుక్రవారం ఘనంగా బాధ్యతలు స్వీకరించింది. మున్సిపల్ బరిలో విజయం సాధించిన చైర్‌పర్సన్ డాక్టర్ పాప చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్‌తో పాటు కౌన్సిలర్లు అధికారికంగా పదవులు చేపట్టారు. మున్సిపాలిటీ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన చైర్‌పర్సన్ డాక్టర్ పాప చంద్రకళ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శక పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, పారిశుద్ధ్యం మరియు తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. వైస్ చైర్మన్ కట్ల సంతోష్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలో సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని, ప్రజల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నూతి సత్యనారాయణ, పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాందాస్ నాయక్, మండల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నూతన పాలకవర్గానికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపాలిటీలో కొత్త పాలకవర్గం బాధ్యతలు స్వీకరించడంతో పట్టణ ప్రజల్లో అభివృద్ధిపై ఆశలు చిగురిస్తున్నాయి.

# డిస్కస్ త్రోలో రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి సాధించిన సాయిచరణ్

## ఎంఇఓ, ఉపాధ్యాయుల అభినందనలు



**రాయపర్తి/ఫిబ్రవరి 20 (జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థి రంగరాజుల సాయిచరణ్ రాష్ట్ర స్థాయి క్రీడల్లో సత్తా చాటాడు. స్పెషల్ నీడ్ ఎడ్యుకేట్ చిల్డ్రన్ విభాగంలో నిర్వహించిన డిస్కస్ త్రో పోటీలలో పాల్గొని రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి సాధించి మండలానికి కీర్తి తెచ్చిపెట్టాడు. తన క్రమశిక్షణ, పట్టుదల, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతో సాయిచరణ్ ఈ విజయాన్ని అందుకోవడం విశేషం. ప్రత్యేక అవసరాలున్న విద్యార్థుల క్రీడా విభాగంలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం దక్కించుకోవడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి వెన్నంపల్లి శ్రీనివాస్, కంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గారే కృష్ణమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. సతీష్ విద్యార్థి సాయిచరణ్‌తో పాటు అతనికి శిక్షణ అందించిన ఉపాధ్యాయుడు రాజేంద్ర ప్రసాద్‌ను శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఉపాధ్యాయులు అంకితభావంతో శ్రమిస్తే విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలలో రాణించగలరని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలోనూ ప్రతిభ కనబరిచి సమగ్ర అభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాక పద్మావతి, ప్రసాద్ రావు, శ్రీనివాస్, సుధీర్, దయ, సిఆర్పి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్మన్ చంద్రకళకు కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షలు

**వైరా/ఫిబ్రవరి 20 (జర్నలిస్ట్ వార్త):** వైరా మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్‌గా విజయం సాధించిన డాక్టర్ కాపా చంద్రకళను కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు ఆమెకు శాలువాతో సత్కారం చేసి అభినందనలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారాం, తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపా సుధాకర్, కాపా మహేష్ పాల్గొన్నారు. నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన చంద్రకళ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై నూతన చైర్మన్‌కు అభినందనలు తెలియజేశారు.



# యాదాద్రిలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

## మత్స్యావతార అలంకారంలో నారసింహుడు

యాదగిరిగుట్ట,**ఫిబ్రవరి 20 (జర్నలిస్ట్ వార్త)::** మహిమాన్విత యాదగిరిగుట్టపై పంచ నారసింహుడిగా కొలువైన దేవ దేవుడి మత్స్యావతార అలంకార వైభవం భక్త జనులను అలరించింది. స్వామి వారి ప్రధానాలయం లక్ష్మీనరసింహస్వామి వారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు శుక్రవారం నిత్యపూజ కైంకర్యాల అనంతరం మూలమంత్ర, మూర్తి మంత్ర హోమాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని అభిషేకించి మత్స్యావతారుడిగా అలంకరించి ఆస్థానం చేశారు. నాలుగు వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు, దివ్యప్రబంధ ప్రాశుర పఠనాలను కనుల పండువగా చేపట్టారు. దుష్ట శిక్షణ..శిష్ట రక్షణ కోసం మహా విష్ణువు అవతార రూపాల్లో స్వామివారిని ఉత్సవాల్లో అలంకరించి సేవించడం ప్రత్యేకత అంటూ ప్రధానార్చకులు మత్స్యావతార విశిష్టతను వివరించారు

# వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ల బాధ్యతల స్వీకారం

## ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే నాగరాజు పిలుపు














**వర్ధన్నపేట/ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మున్సిపాలిటీ నూతన చైర్మన్గా పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్గా నేతావత్ శీభారాణి,రాజేందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నూతన బాధ్యతలను స్వీకరించిన వారిని శాలువాలతో సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని స్పష్టం చేశారు. వర్ధన్నపేట పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనివ్వాలి.

పారదర్శకత: పాలనలో పారదర్శకతను పాటిస్తూ, ప్రజల భాగస్వామ్యంతో సమస్యలను పరిష్కరించాలి. కౌన్సిలర్లు మరియు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వర్ధన్నపేటను జిల్లాలోనే ఆదర్శ మున్సిపాలిటీగా నిలపాలని కోరారు.

**కృతజ్ఞతలు తెలిపిన చైర్మన్..**


తొలుత మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్, వైస్ చైర్మన్ కౌన్సిలర్లు ప్రత్యేక పూజలు నిర్వహించగా, వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం చైర్మన్ పాలకుర్తి సారంగపాణి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన ఎమ్మెల్యే నాగరాజు కి, సహకరించిన కౌన్సిలర్లందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెడుతూ నిరంతరం ప్రజాసేవలో ఉంటానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో బెజ్జం పాపారావు, నూనవత్ కమిలి, మాలోత్ దేవేందర్, చిలువేరు రమ, తుమ్మల అరుణ, తిరుపెల్లి వాణి, మున్సిపల్ చైర్మన్ సుధీర్, జిల్లా పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, పట్టణ అధ్యక్షుడు మైస సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజీరెడ్డి తదితరులతో పాటు భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.









## ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎండి యూనస్



**స్టేషన్ ఘన్పూర్/ఫిబ్రవరి 20 (జర్నలిస్ట్ వార్త) :** అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు నిజామాబాదు పట్టణం లో ఈ నెల 18 న ప్రారంభమై 20న శు క్రవారం తో ముగిసాయి. ఈ మహాసభ ముగింపు రోజు రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా కన్వీనర్ యునస్ ను రాష్ట్ర కౌన్సి ల్ సభ్యుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యునస్ మాట్లాడుతూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నుకోవడం చాలాగర్వాంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాన్ని బలోపేతం చేస్తా నని అన్నారు. తన పై నమ్మకం తో రాష్ట్ర కౌన్సిల్ లోకి తీసుకున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షా కార్య దర్శులు మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ లకు రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సీఎం కప్ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంజెపి ఉర్సుగుట్ట విద్యార్థినుల ఎంపిక





**వరంగల్/ఫిబ్రవరి 20(జర్నలిస్ట్ వార్త):** హైదరాబాద్లో నిర్వహించనున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంజెపి వరంగల్, (ఉర్సుగుట్ట)బాలికల పాఠశాల నుంచి ఎనిమిది మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. జిల్లా స్థాయిలో జరిగిన యోగా పోటీల్లో తమ ప్రతిభను చాటుకుని, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థినులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. క్రీడల్లో రాణిస్తూ పాఠశాలకు పేరు తెస్తున్న విద్యార్థినుల కృషిని ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి, పీడీ మానస, పీఈటీ కవితలతో పాటు ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చి, మరిన్ని పతకాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

## వైరా మున్సిపల్ చైర్మన్ను మర్యాదపూర్వకంగా కలిసిన జర్నలిస్టు వార్త ఖమ్మం బ్యూరో నారపోగు ప్రసాద్ బాబు



**వైరా/ఫిబ్రవరి 20 (జర్నలిస్ట్ వార్త):** వైరా మున్సిపల్ పరిధిలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ కాపా చంద్రకళ దంపతులను ఖమ్మం జిల్లా జర్నలిస్టు వార్త ఖమ్మం బ్యూరో నారపోగు ప్రసాద్ బాబు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన చైర్మన్కు శాలువా కప్పి, బొకే అందజేసి అభినందనలు తెలిపారు. వైరా మున్సిపాలిటీ పరిధిలో మెజార్టీ కౌన్సిలర్ల అభిప్రాయం మేరకు చైర్మన్గా ఎన్నిక కావడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. పట్టణ అభివృద్ధి దిశగా సమగ్ర చర్యలు తీసుకుని ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని ఆకాంక్షించారు. అలాగే వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ను కూడా కలిసి శుభాభివందనాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.